సాక్షి సిద్దిపేట

శుక్రవారం । 16 । మే । 2025

నేత్రపర్వం.. తెప్పోత్సవం



కోమటిచెరువులో హనుమాన్ తెప్పోత్సవం

మిన్నంటిన శ్రీరామ నామస్మరణతో గురువారం రాత్రి కోమటిచెరువులో తెప్పోత్సవం నేత్రపర్వంగా సాగింది. గంగమ్మ ఒడిలో ఆధ్యాత్మికత ఉట్టిపడేలా అందంగా అలంకరించిన బోటులో హనుమంతుని ఉత్సవ విగ్రహాన్ని ప్రతిష్ఠించి చెరువు అంతా తిప్పారు. అంతకుముందు రావిచెట్టు హనుమాన్ దేవాలయం నుంచి పట్టణ ప్రధాన వీధుల గుండా కోమటి చెరువు వరకు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి చెరువులో తెప్పోత్సవం వైభోవంగా చేపట్టారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే హరీశ్‌రావు, పీఠాధిపతులు దుర్గాప్రసాద్ స్వామీజీ, మాలధారులు పెద్ద ఎత్తున పాల్గొని తరించారు.

– సిద్దిపేటజోన్



పూజాసామగ్రి తెస్తున్న హరీశ్‌రావు, చిత్రంలో స్వామీజీలు

మల్లన్న హుండీ ఆదాయం రూ.90 లక్షలు



కొమురవెల్లి మల్లన్న ఆలయంలో నగదు లెక్కిస్తున్న సిబ్బంది, శివరామ కృష్ణ భజనమండలి సభ్యులు

మల్లికార్జున స్వామి వారి ఖజానాకు హుండీ ద్వారా రూ.90 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి అన్నపూర్ణ తెలిపారు. గురువారం హుండీలోని కానుకలను దేవాదాయ శాఖ సిద్దిపేట డివిజన్ ఇన్‌స్పెక్టర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో లెక్కించారు. నగదు రూ.90,09,170, విదేశీ కరెన్సీ నోట్లు 22, మిశ్రమ బంగారం 96 గ్రాములు, మిశ్రమ వెండి 9కిలోల 50 గ్రాములు, పసుపు బియ్యం14 క్వింటాళ్లు వచ్చినట్లు తెలిపారు. 48రోజులలో హుండీల ద్వారా లభించిన నగదును స్థానిక బ్యాంక్‌లో జమ చేసినట్లు అన్నపూర్ణ తెలిపారు.

– కొమురవెల్లి(సిద్దిపేట)

న్యూస్‌రీల్

దిశ బోర్డు మెంబర్‌గా ప్రవీణ్‌కుమార్



దుబ్బాక: జిల్లా స్థాయిలో కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు, పర్యవేక్షణ, సమన్వయం లక్ష్యంగా రూపొందించిన దిశ కమిటీ మెంబర్‌గా దుబ్బాకకు చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు సుంకోజి ప్రవీణ్‌కుమార్ నియమితులయ్యారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ మార్గదర్శకాల ప్రకారం ఎంపీ రఘునందన్‌రావు సూచన మేరకు జిల్లా దిశ మెంబర్‌గా నియమించారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ నాపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించడంతో రఘునందన్‌రావుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రజలకు సమగ్రంగా అందేలా కృషి చేస్తానన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్, కళాశాల సిబ్బంది

దుబ్బాకటౌన్: ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని దుబ్బాక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భవాని అన్నారు. గురువారం కళాశాలలో 2025–26 విద్యా సంవత్సరం ప్రవేశాలకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దోస్త్ ద్వారా కళాశాలలో మొదటి విడత ప్రవేశాలకు ఈ నెల 21 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. దుబ్బాక కళాశాలలో సీబీసీఎస్ విధానంలో బీఏ, బీకాం, బీఎస్సీ, తదితర కోర్సులో విద్యనందిస్తున్నామన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దోస్ కోఆర్డినేటర్ శ్యాంసుందర్, కళాశాల సిబ్బంది, తదితరులున్నారు.

అవకతవకలపై విచారణ



మహిళా సంఘాల సభ్యులతో మాట్లాడుతున్న డీఏఓ జయశ్రీ

గజ్వేల్‌రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని పలు మహిళా సంఘాల్లో జరిగిన అవకతవకలపై జిల్లా ఆడిట్ అధికారి జయశ్రీ విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా గురువారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో 3 మహిళా సంఘాల సభ్యులతో ప్రత్యేకంగా సమావేశమై రుణ లావాదేవీలపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయా గ్రూపులలో ఎవరెవరు ఎంత రుణాలు తీసుకున్నారు, చెల్లించిన డబ్బులు, ఎవరికి ఇచ్చారు అనే అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఏవో మాట్లాడుతూ మహిళా సంఘాల సభ్యుల నుంచి పూర్తి వివరాలను సేకరించి ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నర్సయ్య, మెప్మా అధికారులు, సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

దేశభక్తి చాటిన దంపతులు

పుట్టిన పాపకు సింధూరం నామకరణం



నంగునూరు(సిద్దిపేట): పుట్టిన పాపకు సింధూరం అని పేరుపెట్టి తమ దేశ భక్తి చాటారు మగ్దుంపూర్‌కు చెందిన దంపతులు. బీజేపీ మాజీ మండలాధ్యక్షుడు వాసర యాదమల్లు కుమారుడు విక్రమ్, కావ్యశ్రీ దంపతులకు మంగళవారం పాప జన్మించింది. పాకిస్తాన్‌పై సిందూర్ పేరిట భారత్ జరిపిన దాడులకు గుర్తుగా పాపకు సింధూరం నామకరణం చేశామని వారు పేర్కొన్నారు. దీంతో పలువురు ప్రశంసలు కురిపిస్తున్నారు.

ప్రగతి బాటలో కీలక అడుగు

ఉమ్మడి మెదక్ జిల్లాకు భారీ ప్రాజెక్ట్

ప్రగతి బాటలో మరో కీలక అడుగు పడింది. ట్రిపుల్‌ఆర్, జాతీయ రహదారుల సమాహారం, రైల్వేలైన్ ఇతర సానుకూల అంశాల వల్ల ఉమ్మడి మెదక్ జిల్లాలో మరో భారీ ప్రాజెక్ట్ నిర్మాణానికి రంగం సిద్ధమైంది. గజ్వేల్ నియోజకవర్గంలోని మనోహరాబాద్ మండలం పరికిబండ శివారులో రూ.996కోట్ల వ్యయంతో మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్కు నిర్మాణానికి కేంద్రం టెండర్లను పిలిచింది. ఇందుకోసం సుమారు 350ఎకరాల భూసేకరణ కూడా పూర్తయ్యింది.

- మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్కు నిర్మాణానికి సన్నాహాలు
- పరికిబండ శివారులో 350ఎకరాల భూసేకరణ
- రూ.996కోట్లతో టెండర్లకు ఆహ్వానం
- లక్షలాదిమందికి ఉపాధి కల్పనే లక్ష్యం



మల్టీ మోడల్ లాజిస్టిక్స్ పార్కు నమూనా

గజ్వేల్: మల్టీ మోడల్ లాజిస్టిక్స్ పార్కు(బహుళ విధ సరుకు రవాణా సేవల సముదాయం) నిర్మాణానికి మార్గం సుగమమైంది. కేంద్ర ప్రభుత్వం రెండున్నరేళ్ల క్రితం 16 లాజిసిక్స్ పార్కులను మంజూరు చేసింది. అందులో మనోహరాబాద్ మండలం పరికిబండ శివారులో నిర్మించనున్న పార్కు ఒకటి. రూ.996కోట్ల అంచనాల వ్యయంతో ఎన్‌హెచ్‌ఏఐ (నేషనల్ హైవే అథారిటీ అథారిటీ ఆఫ్ ఇండియా) అనుబంధ సంస్థ అయిన నేషనల్ హైవేస్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ (ఎన్‌హెచ్‌ఎల్‌ఎమ్‌ఎల్) టెండర్లను పిలిచింది. ఈమేరకు పత్రికల్లో ప్రకటనలు సైతం వెలువడ్డాయి. ఈ పనులను ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో చేపట్టడానికి నిర్ణయించారు. వేల కోట్ల పెట్టుబడుల సమీకరణే లక్ష్యంగా ఈ పార్కు ఏర్పాటు చేయాల్సి ఉన్నది. ప్రత్యక్షంగా లక్ష, పరోక్షంగా మరో రెండు లక్షల మందికి ఉపాధి కల్పనే లక్ష్యంగా ఈ లాజిస్టిక్ పార్కును ఏర్పాటు చేస్తున్నారు.

మచిలీపట్నం పోర్టుకు నేరుగా

మల్టీ మోడల్ లాజిస్టిక్స్ పార్కు అందుబాటులోకి వస్తే ఇక్కడ సరుకు రవాణా, సమీకరణ, పంపిణీ లాంటి సేవలు అందుబాటులోకి వస్తాయి. ఇక్కడి నుంచి ఏపీలోని మచిలీపట్నం పోర్టుకు నేరుగా సరుకుల ఎగుమతులు, దిగుమతులు చేసుకునేందుకు వీలుంటుంది. ఇందుకోసం త్వరలోనే నిర్మించనున్న ట్రిపుల్‌ఆర్ నుంచి ఉమ్మడి నల్గొండ జిల్లా మీదుగా మచిలీపట్నం వరకు రోడ్డు కనెక్టివిటీ అవకాశాలు ఉండటంతో ఈ ప్రతిపాదన ఆమోదం పొందడానికి అవకాశం కలిగింది.

ఉమ్మడి మెదక్ జిల్లాకు మహర్దశ

లాజిస్టిక్ పార్కు నిర్మాణం వల్ల ఉమ్మడి మెదక్ జిల్లాకు మహర్దశ పట్టనుంది. హైదరాబాద్ నగరానికి సమీపంలో ఉన్న ఈ జిల్లా వస్తు రవాణా రంగంలో హబ్‌గా మారితే.. దీనికి అనుబంధంగా మరెన్నో పరిశ్రమలకు ఏర్పాటుకు అడుగులు పడనున్నాయి. కొత్తపల్లి–మనోహరాబాద్ రైల్వే లైన్ కారణంగా గజ్వేల్‌లో ఇప్పటికే గూడ్స్ రైళ్ల నడుస్తుండగా, ఎరువుల రేక్ పాయింట్ విజయవంతంగా నడుస్తోంది. లాజిస్టిక్ పార్కు ఏర్పాటుతో మరింత అభివృద్ధి చెందనునుంది. దీని ద్వారా పరోక్షంగా, ప్రత్యక్షంగా ఉపాధి అవకాశాలు భారీగా పెరగనున్నాయి.



లాజిస్టిక్స్ పార్కు నిర్మాణం కోసం సేకరించిన భూమి

ఎన్నో అనుకూలతలు..

ఎన్నో అనుకూలతల కారణంగా మల్టీమోడల్ లాజిస్టిక్ పార్కు నిర్మాణానికి పరికిబండ శివారు ప్రాంతాన్ని ఎంచుకున్నారు. ఇక్కడ లాజిస్టిక్ పార్కు ఏర్పాటైతే.. ఈ ప్రాంతానికి 44వ నంబర్ ఆరు వరుసల జాతీయ రహదారి, కొత్తగా నిర్మాణం కానున్న ట్రిపుల్‌ఆర్‌కు సమీపంలో ఉండటం, ఇక్కడి నుంచి హైదరాబాద్, కొత్తపల్లి రైల్వేలైన్‌లు అనుసంధానం కావడం, హైదరాబాద్‌లోని శంషాబాద్ అంతర్జాతీయ విమనాశ్రయం కూడా చేరువలో ఉండటం కలిసి వచ్చింది.

సరికొత్త సాగుపై దృష్టి సారించండి

- పంట మార్పిడితోనే అధిక లాభాలు
- నేపియర్ గడ్డి సాగుతో 45 రోజుల్లోనే కోత
- ఎకరం పంటకు రూ.70వేల వరకు ఆదాయం : కలెక్టర్ మనుచౌదరి



మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

అక్కన్నపేట(హుస్నాబాద్): వరి, పత్తి, మొక్కజొన్న పంటల సాగు కాకుండా సరికొత్తగా సాగు చేసేలా ప్రతి రైతు ఆలోచించాలని కలెక్టర్ మనుచౌదరి అన్నారు. మండల పరిధిలోని కుందనవానిపల్లిలో గురువారం ప్రసిద్ధ రైతు ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో కృషికల్ప సహకారంతో గండిపల్లి, కుందనవానిపల్లి గ్రామ రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా సుమారు 40 రైతు ఉత్పత్తిదారుల సంఘాలున్నాయన్నారు. అందులో అక్కన్నపేట మండలంలోని ప్రసిద్ధ, సహస్ర సంఘాల ద్వారా సరికొత్త పంట సాగు వైపు దృష్టిసారించామన్నారు. పంట మార్పిడితోనే అధిక లాభాలు వస్తాయన్నారు. కృషికల్ప సహకారంతో నేపియర్ గడ్డి సాగుకు రైతులందరూ ఆలోచించుకోవాలన్నారు. ఈ గడ్డి సాగు కేవలం 45రోజులలోనే కోతకు వస్తుందన్నారు. నేపియర్ గడ్డి ఒక ఎకరంలో సాగు చేస్తే దాదాపు రూ.70వేల వరకు ఆదాయం వస్తుందన్నారు. ఈ గడ్డితో బయోగ్యాస్ తయారు చేస్తారన్నారు. గండిపల్లి, కుందనవానిపల్లి గ్రామాల్లో సుమారు 300ఎకరాల్లో ఈ గడ్డి సాగు చేసేలా రైతులు ముందుకు రావాలన్నారు. ఈ ప్రాంతంలోనే రూ.50కోట్ల వ్యయంతో బయోగ్యాస్ తయారీ కంపనీ ఏర్పాటు చేస్తారన్నారు. దీంతో ఈ ప్రాంత యువతకు ఉద్యోగ అవకాశాలు కూడా వస్తాయన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి రాధిక, హార్టికల్చర్ అధికారి సువర్ణ, కృషికల్ప వ్యవస్థాపకులు పాటిల్, బయోగ్యాస్ కంపెనీ సీఈఓ గుప్తా, హుస్నాబాద్ వ్యవసాయ శాఖ ఏడీఏ శ్రీనివాస్, మండల వ్యవసాయ అధికారి తస్లీమా సుల్తానా, ప్రసిద్ధ రైతు ఉత్పత్తిదారుల సంఘం చైర్మన్ ఏలేటి స్వామిరెడ్డి, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

నాణ్యమైన ఉచిత విద్య

సిద్దిపేటరూరల్: జిల్లాలోని గురుకుల పాఠశాలలో నాణ్యమైన ఉచిత విద్య అందుతోందని కలెక్టర్ మనుచౌదరి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో 6 మైనారిటీ గురుకులాలకు సంబంధించి 5వ తరగతి ప్రవేశాల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇటీవలే కాస్మోటిక్ చార్జీలు పెంచిందని, 2025– 26 సంవత్సరానికి గాను 5వ తరగతిలో మైనార్టీ గురుకులాల్లో రిజిస్ట్రేషన్ చేసుకుని ప్రవేశం పొందాలన్నారు. ఈ అవకాశాన్ని మైనారిటీ విద్యార్థులు తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రీజినల్ కో ఆర్డినేటర్ సుధారాణి, జిల్లాలోని మైనార్టీ పాఠశాలల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

మా భూములకు హక్కులు కల్పించండి

భూ భారతి రెవెన్యూ సదస్సులో రైతుల నిరసన



అధికారుల ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

అక్కన్నపేట(హుస్నాబాద్): మా భూములకు హక్కులు కల్పించాలంటూ రైతులు నిరసన తెలిపారు. మండల పరిధిలోని నందారంలో గురువారం భూ భారతి చట్టంపై నిర్వహించిన అవగాహన సదస్సులో రైతులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుమారు 930 ఎకరాల వరకు పచ్చని పంట పొలాలన్నీ సీలింగ్ భూములుగా ఉండడంతో అమ్మకాలు, కొనుగోలు లేక ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. గతంలో అనేకసార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కావడంలేదన్నారు. బ్యాంకులు సైతం రుణాలు ఇవ్వడంలేదన్నారు. తక్షణం కలెక్టర్ జోక్యం చేసుకుని సమస్య పరిష్కరించాలని, లేదంటే ఆందోళనలు చేస్తామని రైతులు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా రైతులకు అధికారులు హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు. అనంతరం సదస్సులో పాల్గొన్న కొహెడ మండల తహసీల్దార్ సురేఖకు వినతిపత్రం అందజేశారు.

సప్లిమెంటరీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

సిద్దిపేటరూరల్: ఇంటర్ అడ్వాన్స్ సంప్లిమెంటరీ పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ తెలిపారు. ఆ దిశగా అధికారులకు దిశానిర్దేశం చేశారు. గురువారం గరిమా అగర్వాల్ అధ్యక్షతన పరీక్షల నిర్వాహణపై సమావేశం నిర్వహించారు. గరిమా అగర్వాల్ మాట్లాడుతూ ఈనెల 22 నుంచి 29వ తేది వరకు జరగనున్నాయన్నారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు మొదటి సంవత్సరం విద్యార్థులకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సెకండియర్ విద్యార్థులకు జరగనున్నాయని తెలిపారు. మొత్తం 27 పరీక్షా కేంద్రాలలో పరీక్షలు జరగనున్నాయన్నారు. సమావేశంలో రెవెన్యూ, వైద్య, మిషన్ భగీరథ, పోలీస్, విద్యుత్, రవాణా, పోస్టల్, అధికారులు పాల్గొన్నారు.

నల్లా చార్జీల పెంపు

సిద్దిపేటజోన్: మున్సిపాలిటీలో నల్లా పన్నులు, యూజీడీ నిర్వహణ చార్జీలను పెంచారు. పట్టణంలో నెలవారీ నీటిపన్నును రూ.150 నుంచి రూ.200కు, యూజీడీ నిర్వహణకు ప్రతినెలా రూ.100, నివాసేతర ఇళ్లకు రూ.200 చొప్పున వసూలు చేయాలని అధికారులు నిర్ణయం తీసుకున్నారు.

అంబేడ్కర్ జీవితం అందరికీ ఆదర్శం

- రాజ్యాంగంతోనే దళితులకు హక్కులు
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ




అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణలో మందకృష్ణ మాదిగ, రఘునందన్ రావు

ములుగు(గజ్వేల్): అంబేడ్కర్ జీవితం అందరికీ ఆదర్శమని, ఆయన రచించిన రాజ్యాంగం వల్లే దళితులకు, అణగారిన వర్గాలకు హక్కులు దక్కుతున్నాయని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అన్నారు. ములుగు మండలం బస్వాపూర్‌లో గురువారం ఎంపీ రఘునందన్ రావుతో కలసి అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ జీవితం భావితరాలకు ఆదర్శమన్నారు. మహనీయుల విగ్రహాలు ఏర్పాటు చేయడమే కాకుండా వారి జీవితాల నుంచి స్ఫూర్తి పొందాలన్నారు. దేశంలోని ప్రతి పౌరుడు స్వేచ్ఛగా జీవిస్తున్నాడంటే అది అంబేడ్కర్ రచించిన రాజ్యాంగ ఫలమే అన్నారు. ఎంపీ రఘునందన్ రావు మట్లాడుతూ కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నింపి, అక్షరాన్ని ఆయుధంగా మలిచి, జ్ఞానాన్ని ప్రపంచ ఎల్లలు దాటించిన మహోన్నత మూర్తి బాబా సాహెబ్ అంబేడ్కర్ అన్నారు. ప్రజలు అనుభవిస్తున్న రిజర్వేషన్లు అంబేడ్కర్ వల్లే వచ్చాయన్నారు. అంబేడ్కర్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ప్రముఖ గాయకుడు ఏపూరి సోమన్న అంబేడ్కర్‌పై పాడిన పాటలు సభికులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరీ శంకర్ ముదిరాజ్, బీజేపీ, కాంగ్రెస్ మండల అధ్యక్షులు లక్ష్మణ్‌గౌడ్, శ్రీనివాస్‌గుప్తా, ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు మహేష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాయపోల్‌లో చిరుత కలకలం

- గ్రామ సమీప పొలాల్లో సంచారం
- వరుస దాడులతో ప్రజల్లో భయాందోళన
- జాడ కోసం చర్యలు ముమ్మరం
- ట్రాప్ కెమెరాల ఏర్పాటు





రైతుల కెమెరాకు చిక్కిన చిరుత, (పక్క చిత్రంలో) పాదముద్రలు



కుక్కపై దాడి

దుబ్బాకటౌన్: రాయపోల్ మండలం వడ్డేపల్లిలో చిరుత పులి సంచారం కలకలం రేపుతోంది. వరుస దాడులతో గ్రామస్తులు, రైతులు భయాందోళన చెందుతున్నారు. ఇటీవల పొలాల వద్ద రెండు కుక్కలపై దాడి చేసి చంపడంతో ఆందోళనకు గురవుతున్నారు. గడిచిన 4 నెలల వ్యవధిలో చిరుత మూడు సార్లు కనిపించడంతో తీవ్ర చర్చనీయాంశమైంది. రాత్రివేళల్లో, వేకువజామున పొలాలకు వెళ్లేందుకు రైతులు, కూలీలు జంకుతున్నారు. మరిన్ని దాడులు జరగకుండా చిరుతను బంధించాలని రైతులు కోరుతున్నారు.

ఆచూకీ కోసం..

దుబ్బాక ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సందీప్ కుమార్ ఆధ్వర్యంలో చిరుత పులి ఆచూకి కోసం అటవీ శాఖ అధికారులు ప్రయత్నాలు మొదలుపెట్టారు. చిరుత పులిని చూసిన రైతుల నుంచి వివరాలు సేకరించారు. కనబడిన ప్రదేశాన్ని పరిశీలించి పాద ముద్రలను పరిశీలించి చిరుత పులేనని నిర్ధారించారు. చిరుత పులి జాడ కోసం అడవిలో అనుమానిత ప్రదేశాల్లో అధికారులు ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేశారు. దీంతో చిరుత కదలికలను సులభంగా తెలుసుకోవచ్చని చెబుతున్నారు.

అధికారుల సూచనలు

- వ్యవసాయ పొలాలు అడవికి దగ్గరగా ఉండడంతో రైతులు అప్రమత్తంగా ఉండాలి.
- పులి కనిపిస్తే వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారమివ్వాలి.
- పొలాల చుట్టూ విద్యుత్ కంచెను ఏర్పాటు చేయవద్దు.
- పిల్లలు ఎట్టి పరిస్థితుల్లోనూ అడవి దగ్గరగా ఉన్న పొలాల్లో ఒంటరిగా తిరుగవద్దు. రాత్రి వేళ రైతులు పొలాల వద్ద ఉండవద్దు.

ఒకే చోట ఉండదు



చిరుత కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. చిరుత ఎప్పుడూ ఒకే చోట ఉండదు. రైతులు రాత్రి వేళ పొలాల వద్ద ఉండవద్దు. పశువులను సైతం ఇంటి వద్దే ఉంచాలి. పశువుల మేత కోసం ఒంటరిగా అడవిలోకి వెళ్లవద్దు. చిరుత కనిపిస్తే అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలి.

– సందీప్ కుమార్, ఫారెస్టు రేంజ్ ఆఫీసర్, దుబ్బాక

క్లుప్తంగా

అదృశ్యమైన వ్యక్తి మృతదేహం లభ్యం


సాయిలు(ఫైల్)

అల్లాదుర్గం(మెదక్): రెండు నెలల క్రితం అదృశ్యమైన వ్యక్తి చెట్టుకు ఉరేసుకున్నాడు. మృతదేహం కుళ్లిన స్థితిలో లభ్యమైన ఘటన గురువారం అల్లాదుర్గంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ ప్రవీణ్‌రెడ్డి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కోదండం సాయిలు(35) మార్చి 17న భార్యతో గొడవపడి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. సాయిలు కనిపించక పోవడంతో మార్చి 19న పోలీసులకు ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో గ్రామంలో ప్రశాద్‌రావ్ వ్యవసాయ భూమిలో చెట్టుకు ఉరేసుకున్న మృతదేహాన్ని పశువుల కాపరులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఘటనా స్థలానికి పోలీసులు వెళ్లి విచారణ చేపట్టారు. అయితే మృతి చెందిన వ్యక్తి సాయిలు అని అతడి కుటుంబ సభ్యులు గుర్తించారు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోవడంతో ఘటనా స్థలంలోనే పోస్టుమార్టం నిర్వహించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధురాలు అదృశ్యం


గాలి మల్లమ్మ

నర్సాపూర్ రూరల్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన వృద్ధురాలు అదృశ్యమైన ఘటన నర్సాపూర్ మండలం తుజాల్‌పూర్‌లో చోటుచేసుకుంది. ఎస్సై లింగం వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గాలి మల్లమ్మ(60) ఈనెల 13న రేషన్ దుకాణానికి వెళ్లి బియ్యం తీసుకువస్తానని ఇంటి నుంచి వెళ్లింది. సాయంత్రమైనా ఇంటికి రాకపోవడంతో గ్రామంతో పాటు చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. ఆమె కుమారుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సిద్దిపేటలో యువకుడు..


సాయికుమార్

సిద్దిపేటకమాన్: వ్యక్తి అదృశ్యమైన ఘటన సిద్దిపేట పట్టణంలో చోటు చేసుకుంది. వన్‌టౌన్ సీఐ వాసుదేవ రావు వివరాల ప్రకారం.... పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన యాల సాయికుమార్ గత నెల 7వ తేదీన లింగారెడ్డిపల్లికి చెందిన అమ్మాయిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఈ నెల 9వ తేదీన భార్యాభర్తల మధ్య గొడవ జరగగా అతడు అదే రోజు ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల, తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో ఇద్దరు రైతులు మృతి

హవేళిఘణాపూర్(మెదక్): విద్యుదాఘాతంతో వేర్వేరు ఘటనల్లో ఇద్దరు రైతులు మృతి చెందారు. ఎస్‌ఐ సత్యనారాయణ కథనం ప్రకారం .. మండల పరిధిలోని వాడి గ్రామానికి చెందిన లింగం ఎల్లయ్య(33) తన పొలం వద్ద బోరుకు సరఫరా అయ్యే విద్యుత్ వైర్లు సరి చేస్తుండగా విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య రాజమణి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అలాగే మరోఘటనలో స్కూల్‌తండాకు చెందిన ముడావత్ విఠల్(65) పొలం వద్ద ఉన్న వైర్లు అతికిస్తున్న క్రమంలో విద్యాదాఘాతానికి గురై మృతి చెందాడు. ఇది గమనించిన రైతులు కుటుంబీకులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి వెళ్లి చూడగా కిందపడి మృతి చెంది ఉన్నాడు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి ముగ్గురు కుమారులు ఉన్నారు.

తాళం వేసిన రెండిళ్లలో చోరీ

మూడు తులాల బంగారం, రూ.1.10 లక్షలు చోరీ


ఇంట్లో చిందర వందరగా చేసిన వస్తువులు

సిద్దిపేటకమాన్: తాళం వేసిన రెండిళ్లలో చోరీ జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని బాలాజీ నగర్‌లో ఫార్మా కంపెనీలో పనిచేసే రాఘవేంద్రచారి పైఅంతస్తులో, క్రాంతి కింది అంతస్తులో నివాసం ఉంటున్నారు. రాఘవేంద్రచారి ఉద్యోగానికి వెళ్లగా తన భార్య ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌కు వెళ్లింది. క్రాంతి వాళ్ల అమ్మ అనారోగ్యంగా ఉండటంతో ఇంటికి తాళం వేసి రాంపూర్‌కు వెళ్లారు. తిరిగి గురువారం సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా ఇంటి తాళాలు పగులగొట్టి ఉంది. దీంతో లోపలికి వెళ్లి చూడగా రెండిళ్లలో కలిపి మొత్తం 3తులాల బంగారం, 30తులాల వెండి, రూ.1.10లక్షల నగదు చోరీకి గురైనట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు, క్లూస్ టీం సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని వేలిముద్రలు సేకరించారు.

సేవామార్గం.. సమాజ హితం

- ఎన్‌ఎస్‌ఎస్ కార్యక్రమాల్లో నర్సాపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు
- గ్రామాల్లో చెత్తాచెదారం తొలగింపు
- పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన
- నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం పెరుగుదల : వలంటీర్లు


రెడ్డిపల్లిలో ప్లాస్టిక్‌తో జరిగే నష్టాన్ని వివరిస్తున్న విద్యార్థులు


శ్రమదానం చేస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు

నర్సాపూర్ రూరల్: జాతీయ సేవా పథకం (ఎన్‌ఎస్‌ఎస్)ద్వారా సేవా కార్యక్రమాల్లో పాల్గొనడంతో క్షేత్ర స్థాయిలో సమస్యలు, క్రమశిక్షణ, సమాజంపై అవగాహన, నాయకత్వ లక్షణాలతోపాటు ఆత్మవిశ్వాసం పెరిగిందని నర్సాపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ -1 విద్యార్థులు అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన

నర్సాపూర్ మండలంలోని రెడ్డిపల్లిలో ఇటీవల వారం రోజులపాటు వేసవి శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు గ్రామంలోని ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలతోపాటు ఆయా వీధుల్లో పిచ్చి మొక్కలు, చెత్తాచెదారం తొలగించి పరిసరాల పరిశుభ్రతపై స్థానిక ప్రజలకు అవగాహన కల్పించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలతోపాటు బేటీ బచావో-బేటీ పడావో, బాల్య వివాహాలు, మత్తు పదార్థాలు, ప్లాస్టిక్‌తో కలిగే నష్టాలు, ఆడపిల్లలను చదివించాలని చైతన్య పరిచారు.

ఇంటింటికీ వెళ్లి సర్వే

గ్రామంలో ప్రతి ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించి నిరక్షరాస్యులు, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలపై సర్వే నిర్వహించారు. మధ్యాహ్నం సమయంలో అధ్యాపకులతోపాటు పలువురు వక్తలు వివిధ అంశాలపై ఇచ్చిన ఉపన్యాసాలతో మాలో ఆత్మవిశ్వాసం పెరిగిందని విద్యార్థులు పేర్కొన్నారు. రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో రక్తదానం చేశారు. గ్రామస్తులను చైతన్య పరిచేందుకు ఆటపాటలతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు.

నాయకత్వ లక్షణాలు మెరుగుపడ్డాయి



ఎన్‌ఎస్‌ఎస్ ద్వారా చేపట్టిన సేవా కార్యక్రమాలతో నాయకత్వ లక్షణాలు మెరుగుపడ్డాయి. దీంతోపాటు టీమ్ వర్క్ అలవాటైంది. బృందాలుగా ఏర్పడి రోజు వారి కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాం. చదువుతోపాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం సంతోషంగా ఉంది. – దాసరి శివరాజ్, విద్యార్థి, బీఏ సెకండ్ ఇయర్

క్రమశిక్షణ అలవాటైంది



జాతీయ సేవా శిబిరంలో వారం రోజులపాటు పాల్గొనడంతో క్రమశిక్షణ అలవాటైంది. ఉదయం లేచి గ్రామంలో శ్రమదానం చేయడంతోపాటు మధ్యాహ్నం అధ్యాపకులు, వకల ఉపన్యాసాలతో కొత్త విషయాలు తెలుసుకున్నాం. క్షేత్రస్థాయిలో ప్రజల జీవన విధానం, సమాజంపై అవగాహన కలిగింది. – ఎస్. ప్రణయ, విద్యార్థిని, బీస్సీ ఫస్ట్ ఇయర్

సేవలపై అవగాహన అవసరం



ప్రతీ విద్యార్థికి చదువుతోపాటు సేవా కార్యక్రమాలపై అవగాహన అవసరం. జాతీయ సేవా పథకం ద్వారా క్రమశిక్షణ, సేవా దృక్పథం, నాయకత్వ లక్షణాలు తదితర అంశాలపై అవగాహన వస్తుంది. ప్రజల జీవన విధానం, సామాజిక, ఆర్థిక విషయాలపై అవగాహన పెరుగుతుంది. –డాక్టర్ సురేశ్ కుమార్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాంఅధికారి

డిపాజిట్ డబ్బులు మాయం!

- కొల్చారం పోస్టాఫీస్ ఎదుట ఖాతాదారుల ఆందోళన
- మాయమైన సొమ్ము సుమారు రూ.10లక్షలు


పోస్టాఫీస్ ఎదుట ఆందోళనకు దిగిన ఖాతాదారులు

కొల్చారం(నర్సపూర్): మండల కేంద్రంలోని పోస్టాఫీస్‌లో ఖాతాదారులు డిపాజిట్ చేసిన డబ్బులు మాయమయ్యాయి. గురువారం కార్యాలయం ఎదుట వారు ఆందోళన చేశారు. గ్రామానికి చెందిన కొంతమంది పోస్టాఫీస్‌లో డిపాజిట్ రూపంలో, నెల నెలా డబ్బులు వచ్చేలా రికరింగ్ డిపాజిట్ పథకంలో డబ్బులు జమ చేశారు. వీటికి సంబంధించి సిబ్బంది పాస్ పుస్తకాలు, సంబంధిత పత్రాలు ఖాతాదారులకు ఇచ్చారు. నాలుగు నెలల క్రితం అసిస్టెంట్ పోస్ట్ మాస్టర్‌గా పనిచేస్తున్న లంబాడి రవి అనారోగ్యంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అనంతరం నూతన అసిస్టెంట్ పోస్టుమాస్టర్‌గా గ్రామానికి చెందిన కొత్త శేఖర్ విధుల్లో చేరాడు. ఇటీవల ఆడిట్ నిర్వహించగా.. డిపాజిట్ల ఖాతాలకు ఆధార్ అనుసంధానం చేయాలని శేఖర్ ఖాతాదారుల ఇళ్లకు వెళ్లి పాసుపుస్తకాలు, డిపాజిట్ పత్రాలను తీసుకెళ్లినట్లు బాధితులు తెలిపారు. అప్పటినుంచి తీసుకెళ్లిన వాటిని ఇవ్వాలని, డబ్బులు తిరిగి ఇవ్వాలని కార్యాలయం చుట్టూ తిరిగినా ప్రయోజనం లేదు. ఈ విషయమై శేఖర్‌ను నిలదీయగా డబ్బులు జమ చేయలేదని దబాయించాడు. దీంతో కోపోద్రిక్తులైన ఖాతాదారులు ఆందోళనకు దిగారు. మాయమైన సొమ్ము దాదాపు రూ.10 లక్షల వరకు ఉంటుందని, ఇందులో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరి పేర రూ.5 లక్షలని గ్రామస్తుల ద్వారా తెలిసింది. ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని ఖాతాదారులు డిమాండ్ చేస్తున్నారు.

వారం రోజుల్లో కూతురి పెళ్లి

- గుండెపోటుతో తండ్రి మృతి
- తండ్రి అంత్యక్రియలు నిర్వహించిన కూతురు


నాగయ్య (ఫైల్)


తండ్రికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న కూతురు

అల్లాదుర్గం(మెదక్): కూతురి పెళ్లి పనుల్లో బిజీగా ఉన్న ఓ తండ్రికి గుండెపోటుతో రావడంతో మృతి చెందాడు. కొడుకులు లేకపోవడంతో కూతురే అంత్యక్రియలు నిర్వహించిన ఘటన అల్లాదుర్గం మండలం బహిరన్‌దిబ్బ గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. గ్రామస్తుల వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన నడిపోల్ల నాగయ్య (53) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈయనకు ఇద్దరు కూతుళ్లు తేజ, అశ్విని. ఈ నెల 21న తేజ పెళ్లి నిశ్చమైంది. ఈ పనుల్లో బిజీగా ఉండగా నాగయ్యకు గుండెపోటు రావడంతో ఇంట్లోనే కుప్పకూలి మృతి చెందాడు. కొడుకులు లేక పోవడంతో కూతురు తేజ తండ్రి అంత్యక్రియలు నిర్వహించారు. వారం రోజుల్లో పెళ్లి ఉండగా తండ్రి మృతి చెందడంతో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

విగ్రహం ధ్వంసం చేసిన వారిని శిక్షించాలి


వివేకానంద విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న అఖిల పక్ష, హిందూ సంఘాల నాయకులు

హిందూ సంఘాలు, అఖిలపక్షం ఆధ్వర్యంలో ధర్నా

నంగునూరు(సిద్దిపేట): నంగునూరులో వివేకానంద విగ్రహాన్ని ధ్వంసం చేసిన నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలని అఖిలపక్ష నాయకులు ఇచ్చిన బంద్ ప్రశాంతంగా ముగిసింది. హిందూ సంఘాలు, అఖిల పక్షం ఆధ్వర్యంలో గురువారం నంగునూరులో ర్యాలీ నిర్వహించి విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. గ్రామంలో అపరిచిత వ్యక్తులు స్థానికంగా నివాసం ఉంటున్నారని, వారి ఆధార్ కార్డులను పరిశీలించాలని పోలీసుల దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం వివిధ పార్టీల నాయకులు మాట్లాడుతూ... కొన్నేళ్ల కింద గ్రామంలో విగ్రహం ఏర్పాటు చేస్తున్న సమయంలో గొడవలు జరిగాయన్నారు. సమస్య సమసిపోయి అందరి ఆమోదంతో తహసీల్దార్ కార్యాలయం సర్కిల్‌లో విగ్రహాన్ని నెలకొల్పామని తెలిపారు. ఇన్నాళ్లు ప్రశాంతంగా ఉన్నామని, కొందరు గొడవలు సృష్టించేందుకు ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. విషయం తెలుసుకున్న సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను, రాజగోపాల్‌పేట ఎస్‌ఐ అసీఫ్ ఘటనా స్థలానికి చేరుకొని ఆందోళన విరమింపజేశారు. కాగా కేసు దర్యాప్తు చేస్తున్నామని, నిందితులను రెండు రోజుల్లో పట్టుకుంటామని సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

ఉమ్మడి జిల్లాలో వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందారు.

టిప్పర్ బైక్‌ను ఢీకొన్న ఘటనలో వ్యక్తి..

పటాన్‌చెరు టౌన్: టిప్పర్ బైక్‌ను ఢీకొట్టిన ఘటనలో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... రంగారెడ్డి జిల్లా...రాజేంద్రనగర్ ఉప్పర్‌పల్లికి చెందిన మహమ్మద్ అబ్దుల్ మజీద్(46) పటాన్‌చెరు మండలం లక్డారం ఆస్కాన్ మినరల్స్‌లో మేనేజర్‌గా పనిచేస్తూ అదే గ్రామంలో ఉంటున్నాడు. ఈ క్రమంలో 14న రాత్రి విధులు ముగించుకొని ఇంటికి బైక్‌పై వస్తుండగా మార్గమధ్యలో టిప్పర్ డ్రైవర్ బైక్‌ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన మహమ్మద్ అబ్దుల్ మజీద్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. మృతుడి బంధువు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని..

తూప్రాన్: గుర్తు తెలియని ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన పట్టణ సమీపంలోని 44వ జాతీయ రహదారిపై బుధవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ యాదగిరి వివరాల ప్రకారం... వెల్దుర్తి మండలం శేట్టిపల్లి కలాన్‌కు చెందిన తలకొక్కుల శివరాములు(42) కొన్నేళ్లుగా తూప్రాన్ బైపాస్ మార్గంలోని వినోద్ దాబాలో కూలీ పని చేస్తున్నాడు. ఈ క్రమంలోనే రహదారిపై సైకిల్‌పై వెళ్తున్న క్రమంలో వెనుక నుంచి గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో అతడు అక్కడిక్కడే మృతి చెందాడు.

బస్సు రివర్స్ తీస్తుండగా కార్మికుడు..

పటాన్‌చెరు టౌన్: బస్సు రివర్స్ తీస్తున్న క్రమంలో కార్మికుడిని ఢీకొట్టడంతో తీవ్ర గాయాలై మృతి చెందాడు. పటాన్‌చెరు పోలీసుల వివరాల ప్రకారం... సదాశివపేటకు చెందిన భూమయ్య (50) పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామ సమీపంలోని ఎంఎస్‌ఎన్ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం ఉదయం కంపెనీ బస్సులో పరిశ్రమకు వెళ్లాడు. అనంతరం వాష్ రూమ్‌కు వెళ్లి తిరిగి కంపెనీలోకి వస్తుండగా డ్రైవర్ అజాగ్రత్తగా బస్సును రివర్స్‌లో నడిపి కార్మికుడు భూమయ్యను ఢీకొట్టి పైనుంచి వెనకటైర్లు వెళ్లాయి. దీంతో అతడు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య విజయ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు ఘటనల్లో ఆరుగురు ఆత్మహత్య

ఉమ్మడి మెదక్ జిల్లాలో గురువారం వేర్వేరు ఘటనల్లో ఆరుగురు ఆత్మహత్యకు పాల్పడ్డారు.


ప్రమీల, అక్షయ్ మృతదేహాలను పరిశీలిస్తున్న పోలీసులు

నిజాంసాగర్ ప్రాజెక్టులో దూకి తల్లీకొడుకు..

కల్హేర్(నారాయణఖేడ్): భర్త మరణించాడనే మనోవేదనతో కొడుకుతో కలిసి తల్లి నిజాంసాగర్ ప్రాజెక్టులో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. నిజాంసాగర్ ఎస్‌ఐ శివకుమార్ కథనం ప్రకారం.. సంగారెడ్డి జిల్లా నిజాంపేట్ మండలం మునిగేపల్లికి చెందిన దార ప్రమీల(30), కుమారుడు అక్షయ్(8)ను వెంటబెట్టుకొని బ్యాంకు పని నిమిత్తం వెళ్లి వస్తామని చెప్పి బుధవారం ఇంటి నుంచి బయల్దేరింది. నిజాంసాగర్ ప్రాజెక్టు వద్దకు వచ్చి 20 గేట్ వద్ద కొడుకుతో కలిసి నీటిలోకి దూకింది. ఈ క్రమంలో ప్రాజెక్టులో చేపలు పట్టే మత్స్యకారులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ శివకుమార్ సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాలను బయటకు తీయించారు. మృతుల కుటుంబీకులకు సమాచారం అందించారు. కాగా ప్రమీల భర్త దార సాయిలు ఇటీవల ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన ప్రమీల జీవితంపై విరక్తి చెందింది. మృతురాలికి కూతురు నిహారిక ఉంది. తల్లికొడుకు ఇంటి నుంచి బయటకు వచ్చే సమయంలో ఆమె ఇంట్లో లేదు. దీంతో ప్రాణాలతో బయటపడింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అప్పులు తీర్చలేక..


సత్యనారాయణ(ఫైల్)

చిన్నశంకరంపేట(మెదక్): అప్పులు చేసి దుబాయికి వెళ్లిన వ్యక్తి తీర్చేందుకు పొలం కుదువ పెడుదామని ప్రయత్నించి విఫలమై ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన చిన్నశంకరంపేట మండలం శాలిపేట గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. చిన్నశంకరంపేట ఎస్‌ఐ నారాయణగౌడ్ కథనం ప్రకారం... శాలిపేట గ్రామానికి చెందిన మాలే సత్యనారాయణ(40)కు భార్యాపిల్లలున్నారు. పదేళ్ల క్రితం దుబాయి వెళ్లేందుకు అప్పులు చేశాడు. దుబాయి నుంచి తిరిగి వచ్చినప్పటికీ చేసిన అప్పులు మాత్రం తీరలేదు. తనకు ఉన్న 30 గుంటల పొలంతో బతకడం కష్టమని భావించి గత ఏడాది నుంచి మేడ్చల్‌లో పనిచేస్తూ కుటుంబ సభ్యులతో కలిసి ఉంటున్నాడు. ఈ క్రమంలో అప్పు ఇచ్చినవాళ్లు అడుగుతుండటంతో గ్రామంలో ఉన్న భూమిని కుదువపెట్టి రూ. 2 లక్షలు ఇవ్వాలని పలువురిని అడిగినా అప్పు పుట్టే మార్గం కన్పించలేదు. దీంతో బుధవారం రాత్రి ఇంటి నుంచి వెళ్లిన అతడు పొలం వద్ద చెట్టుకు ఉరివేసుకున్నాడు. గురువారం ఉదయం గమనించిన గ్రామస్తులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి భార్య కృష్ణవేణి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

విషం తాగి వ్యక్తి...

పాపన్నపేట(మెదక్): విషం తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండల పరిధిలోని శానాయపల్లిలో గురువారం చోటు చేసుకుంది. సంబధీకుల కథనం ప్రకారం... గ్రామానికి చెందిన గజ్జెన లాలయ్య(52) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం ఉదయం విషం తాగి ఇంట్లో వాంతులు చేసుకుంటూ పడి పోయాడు. కుటుంబీకులు గమనించే లోగా మృతి చెందాడు. కుటుంబీకుల పోలీసులకు సమాచారం అందించగా ఘటనా స్థలాన్ని పరిశీలించి, పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, కూతురు, కొడుకు ఉన్నారు. ఎస్సై నరేష్‌ను వివరణ కోరగా ఫిర్యాదు రాగానే కేసు నమోదు చేస్తామని తెలిపారు.

అనారోగ్య సమస్యలతో..


సౌమ్య (ఫైల్)

మిరుదొడ్డి(దుబ్బాక): అనారోగ్య సమస్యలు తాళలేక యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధిలోని ధర్మారంలో చోటు చేసుకుంది. హెడ్‌కానిస్టేబుల్ ప్రమోద్ కుమార్ కథనం ప్రకారం... ధర్మారం గ్రామానికి చెందిన చెప్యాల రాజు, గౌరమ్మ దంపతుల కుమార్తె సౌమ్య (18) రెండేళ్ల నుంచి అనారోగ్య సమస్యలతో బాధపడుతోంది. ఎన్ని ఆస్పత్రుల్లో చికిత్స చేయించినా నయం కాలేదు. దీంతో మనస్తాపానికి గురైన ఆమె ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకుంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దుబ్బాక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

మోసపోయి యువకుడు..


భాను ప్రకాష్ (ఫైల్)

మిరుదొడ్డి(దుబ్బాక): వీసా విషయంలో బ్రోకర్లు మోసం చేశారన్న మనోవేదనకు గురైన యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని మోతె గ్రామంలో గురువారం జరిగింది. ఎస్‌ఐ హరీశ్ కథనం ప్రకారం... గ్రామానికి చెందిన గోత్రాల రాజు పద్మల ఏకైక కుమారుడు భాను ప్రకాశ్ (27) గత ఏడాది జూలైలో ఉపాధి కోసం సౌదీకి వెళ్లాడు. అక్కడ వీసా విషయంలో బ్రోకర్లు మోసం చేశారని తేలడంతో ఈ ఏడాది జనవరిలో స్వగ్రామమైన మోతెకు తిరిగి వచ్చాడు. దీంతో సౌదీకి వెళ్లడానికి చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక మదన పడుతుండేవాడు. ఈ క్రమంలో తాగుడుకు బానిసయ్యాడు. గురువారం తన వ్యవసాయ భూమి వద్ద చెట్టుకు ఉరి వేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దుబ్బాక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

బైక్ కొనివ్వలేదని ఆత్మహత్యాయత్నం..

న్యాల్‌కల్(జహీరాబాద్): బైక్ కొనివ్వలేదని నిరాశకు గురైన వ్యక్తి బావిలో దూకి ఆత్మహత్యాయత్నం చేశాడు. గ్రామస్తుల కథనం ప్రకారం... మండల పరిధిలోని మామిడ్గి గ్రామానికి చెందిన సాలమాన్(35) కొన్ని రోజులుగా బైక్ ఇప్పించాలని తల్లి మొగులమ్మను అడుగుతూ వస్తున్నాడు. దీంతో మూడు రోజులుగా తల్లితో గొడవ పడుతున్నాడు. గురువారం ఉదయం బైక్ ఇప్పించాలని తల్లిని అడుగగా గ్రూపులో డబ్బులు కట్టాల్సి ఉందని, తర్వాత ఇప్పిస్తానని నచ్చజెప్పింది. దీంతో మనస్తాపానికి గురైన సాలమాన్ బావిలో దూకుతానని తల్లికి చెప్పి వెళ్లాడు. గ్రామ సమీపంలోని బావిలో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. బావిలో ఉన్న మోటరు పైపును పట్టుకుని నీళ్లలో ఉండిపోయాడు. వెంటనే గ్రామస్తులు నచ్చజెప్పి పైకి రావాలని కోరారు. దీంతో తాడు కట్టుకుని పైపు సహాయంతో పైకి వచ్చాడు.

తండ్రి వివాహేతర సంబంధానికి చెక్ పెట్టాలని..

- మధ్యవర్తి మహిళ హత్య
- ఇద్దరు నిందితుల అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు, చిత్రంలో అరెస్టైన ఇద్దరు నిందితులు

పుల్‌కల్(అందోల్): మండల పరిధిలోని బస్వాపూర్ గ్రామానికి చెందిన అంగన్‌వాడీ టీచర్ బేగరి జయమ్మ హత్య కేసు మిస్టరీ వీడింది. ఈ నెల 6న అంగన్‌వాడీ కేంద్రం నుంచి అదృశ్యమై హత్యకు గురై మెదక్ జిల్లా చేగుంట వద్ద కాలిన మృతదేహంతో లభించిన విషయం పాఠకులకు విదితమే. కేసుకు సంబంధించి జోగిపేట సీఐ అనిల్‌కుమార్, పుల్‌కల్ ఎస్‌ఐ క్రాంతి కుమార్ వివరాలు వెల్లడించారు. గ్రామానికి చెందిన బేగరి జయమ్మ అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేస్తోంది. ఈ నెల 6న ఆమె ఇంటింటికీ గుడ్లు పంపిణీ చేస్తుండగా నిందితులైన పుట్ట అనిల్‌కుమార్, స్నేహితుడు డప్పు వినీత్‌తో కలిసి తండ్రి ఆర్థిక లావాదేవీలను అడ్డుపెట్టుకొని జయమ్మను ఇంటిలోకి పిలిచి హత్య చేశారు. అనంతరం ఒంటిపై ఉన్న బంగారు నగలు తీసుకుని కారులో చేగుంట సమీపంలోకి తీసుకుని పెట్రోల్ పోసి తగులబెట్టారు. నిందితుల్లో పుట్ట అనిల్‌కుమార్ తండ్రి రాములు మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకోవడానికి జయమ్మ సహకరించేదని తెలిసింది. దీంతో వీరు ముగ్గురు రోజు అంగన్‌వాడీ కేంద్రంలో విందు చేసుకునే వారని, ఆర్థిక లావాదేవీలు కూడా జరుపుకునేవారని పోలీసులు తెలిపారు. దీంతో రాములు కొడుకు పుట్ట అనిల్ కుమార్ పథకం ప్రకారం జయమ్మను హత్య చేసి తండ్రి వివాహేతర సంబంధానికి చెక్ పెట్టాలని పథకం రచించాడు. ఈ క్రమంలో జయమ్మను తన స్నేహితుడి సహాయంతో హత్య చేసి ఆనవాళ్లు లేకుండా శవాన్ని చేగుంట సమీపంలో కాల్చి వేశారని పోలీసులు పేర్కొన్నారు. నిందితులను గురువారం రిమాండ్‌కు తరలించారు.

నిషేధిత ఆల్ప్రాజోలం పట్టివేత


స్వాధీనం చేసుకున్న ఆల్ప్రాజోలం, నగదు, కారుతో పోలీసులు

జహీరాబాద్ టౌన్: ఆర్టీసీ బస్సులో ఓ వ్యక్తి తీసుకొస్తున్న నిషేధిత ఆల్ప్రాజోలాన్ని పోలీసులు పట్టుకున్నారు. టౌన్ ఎస్‌ఐ. కాశీనాథ్ కథనం ప్రకారం... మహారాష్ట్రలోని పూణేకు చెందిన విశ్వనాథ్ ఆర్టీసీ బస్సులో ఆల్ప్రాజోలంను జహీరాబాద్‌కు తీసుకొస్తున్నట్లు వచ్చిన సమాచారంతో బైపాస్ రోడ్డులో ఇంద్రప్రస్థ వద్ద గురువారం తనిఖీలు నిర్వహించారు. ఆర్టీసీ బస్సులో అతడు తీసుకొస్తున్న 750 గ్రాముల ఆల్ప్రాజోలం దొరికింది. పోలీసులు అతడిని విచారించగా పట్టణానికి చెందిన మిద్దెస్వామి గౌడ్‌కు అమ్మడానికి తీసుకొస్తున్నట్లు చెప్పాడు. దీంతో మిద్దెస్వామి గౌడ్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా ఆల్ప్రాజోలం కొనుగోలు చేస్తున్నట్లు అంగీకరించాడు. అతని వద్ద రూ.7.50 లక్షల నగదు, సెల్‌ఫోన్, కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.